సీఎం మీటింగ్‌లో

పాల్గొన్న కలెక్టర్లు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంగళ వారం వివిధ జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్

-రంగారెడ్డి, జూలై 16(నమస్తే తెలంగాణ)

పంచాయతీ కార్యదర్శి

మాకు వద్దే..వద్దు

- నెల రోజులుగా విధులకు హాజరు కాని రాజు
- పారిశుధ్యం, తదితర పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందుల్లో గొట్లపల్లివాసులు

పంచాయతీ కార్యాలయం వద్ద స్థానికుల నిరసన

గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గొట్లపల్లివాసులు

పెద్దేముల్, జూలై 16 : గ్రామానికి రాని పంచాయతీ కార్యదర్శి మాకు వద్దే.. వద్దని మండలంలోని గొట్లపల్లి గ్రామస్తులు తేల్చి చెప్పారు. పంచాయతీ కార్యదర్శి నెల రోజులుగా గ్రామానికి రావడంలేదని.. దీంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు పేర్కొన్నారు. గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని.. పలువురు రోగాలబారిన పడ్డారని పంచాయతీ కార్యాలయం వద్ద పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఇప్పుడున్న పంచాయతీ కార్యదర్శిని మార్చి పర్మినెంట్ అధికారిని నియమించి సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు.

గ్రామంలో పారిశుధ్య పనులు ఆగిపోయాయని, తాగునీరు సరిగ్గా సరఫరా కావడంలేదని.. కాలనీల్లోని కాల్వలు మురుగుతో నిండిపోయాయని, ఇండ్ల మధ్యన పిచ్చి మొక్కలు పెరిగాయని.. ఈగలు, దోమలు వృద్ధి చెంది స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఈ విషయంపై ఎంపీవో రమేశ్‌కుమార్‌ను వివరణ కోరగా నెల రోజులుగా పంచాయతీ కార్యదర్శి రాజు అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారని, ఆయన స్థానంలో ఆత్కూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్చనకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించామని...రాజు సెలవులు పూర్తి కావడంతో మంగళవారం ఆయన విధుల్లో చేరినట్లు తెలిపారు.

కార్యక్రమంలో గొట్లపల్లి గ్రామస్తులు మమ్మద్ రఫీక్, మాజీ సర్పంచ్ చంద్రప్ప, మల్లప్ప స్వామి, షేక్ ఇస్మాయిల్, ఇర్ఫాన్, రాములు, చాంద్‌పాషా, మమ్మద్ సొహైల్, లాలప్ప, మల్లప్ప, వెంకటప్ప పాల్గొన్నారు.

అందరికీ మాఫీ చేయాలి

- నిబంధనల పేరిట రైతులకు అన్యాయం చేయొద్దు
- భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

షాబాద్, జూలై 16 : పంట రుణాల మాఫీ విషయంలో రేషన్‌కార్డు నిబంధనను తొలగించాలని భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేండ్లుగా కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదన్నారు. రేషన్‌కార్డును ప్రామాణికం చేస్తే అనేకమంది రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కొన్ని కుటుంబాలు ఉమ్మడిగా కొనసాగుతున్నాయని అలాంటి కుటుంబాలకు సైతం ఒకే రేషన్‌కార్డు ఉండడంతో ఒకరికీ మాత్రమే రుణమాఫీ జరిగి మిగిలిన వారికి వర్తించదన్నారు.

ప్రభుత్వం ఒకవైపు రుణమాఫీ అంటూ మరోవైపు పొంతనలేని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. రూ.2 లక్షల పైన ఉన్న అప్పును చెల్లిస్తేనే రూ.2 లక్షల రుణంమాఫీ అవుతుందనే నిబంధనను ప్రభుత్వం పునఃపరిశీలించాలని, 2018 కంటే ముందు ఉన్న అప్పులను రుణమాఫీ పరిధిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ వర్తిస్తుందా...? వర్తించదా..? అనే వివరణ ప్రభుత్వ ప్రకటనలో ఎక్కడాలేదని, ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు యాదవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కృష్ణ తదితరులున్నారు.

కేజీబీవీ భవనం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నేడే కేజీబీవీ భవనం ప్రారంభం

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, జూలై 16 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ విద్యాలయ భవనం ప్రారంభానికి ముస్తాబైంది. కడ్తాల్-కాన్గుబావితండా రహదారిలో రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.3.35 కోట్లతో ఈ బిల్డింగ్‌ను నిర్మించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించిన కొత్త భవనంలో విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా తరగతి, విశ్రాంతి గదులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక గదులు, విద్యుత్తు, నీటి సౌకర్యం, వంటశాలను నిర్మించారు. కాగా మంగళవారం ఉదయం కేజీబీవీ భవనం వద్ద ప్రారంభ ఏర్పాట్లను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కేజీబీవీ భవన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితోపాటు ఉమ్మడి జిల్లాకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, సమగ్ర శిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఈఈ కుమార్‌గౌడ్, ఎంఈవో సర్దార్‌నాయక్, ఎంపీడీవో సుజాత, డీఎఫ్‌వో ప్రభాకర్‌రెడ్డి, ఏంఎన్‌వో జంగయ్య, పాఠశాల ఎస్‌ఈ అనిత, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్యక్షుడు బీచ్చానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, చందోజీ, వేణుగోపాల్, జహంగీర్‌అలీ, నరేశ్‌నాయక్, మోత్యానాయక్, లక్ష్మయ్యగౌడ్, లక్పతినాయక్, బాలరాజు పాల్గొన్నారు.

సమాజ సేవలో యువత ముందుండాలి

ప్రమాద బాధితులను రక్షించిన యువకులకు మేయర్ అభినందన

సిటీబ్యూరో, జూలై 16(నమస్తే తెలంగాణ): సమాజ సేవలో యువత ముందుండాలని జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి అన్నారు. ముషీరాబాద్ సర్కిల్ జాంభవి నగర్‌లో ఆదివారం కురిసిన వర్షాలకు వరద నీటిలో కొట్టుకుపోతున్న కారులో ఉన్న వారిని రక్షించిన యువకులను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అభినందించి, శాలువాలు కప్పి సన్మానించారు. నీటిలో మునిగిపోతున్న కారులో వారిని ఏ విధంగా రక్షించారన్న విషయమై మేయర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్యార్థులు ప్రణీత్‌యాదవ్, మోహన్‌యాదవ్, నాగరాజుచారి, ఎం.మార్టిన్‌లు ప్రమాద ఘటన చూడగానే అప్రమత్తమై చూపిన చొరవ ధైర్య సాహసాలను మేయర్ మెచ్చుకున్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రవికిరణ్ పాల్గొన్నారు.

ఆచరణీయం.. జ్యోతిరావు పూలే బోధనలు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఆర్. కృష్ణయ్య

తుర్కయాంజాల్, జూలై 16 : మహాత్మా జ్యోతిరావు పూలే ఎంచుకున్న మార్గం, ఆయన బోధనలను అందరూ అనుసరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఆయన మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు బీసీ సంఘం కంపెనీ కార్యవర్గం, సరూర్‌నగర్ సర్కిల్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కరుణాకర్‌బాబు, కంపెనీ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం డివిజన్ డీఈ యాదగిరి, రాష్ట్ర విద్యుత్తు బీసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వెంకన్నగౌడ్, చంద్రుడు, సతీష్, సురేందర్, రామ్ లచ్చయ్య, శివకుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఏడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 23 నుంచి, బీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 13 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

రీవాల్యూయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osm ania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సిటీబ్యూరో, జూలై 16(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించబోమని, అధికారులు అప్రమత్తంగా పని చేయాలని జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి అన్నారు. జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లో మంగళవారం శేరి లింగంపల్లి జోన్ యూసుఫ్‌గూడ సర్కిల్ బోరబండ డివిజన్‌కు సంబంధించిన అభివృద్ధి పనులపై సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, వాటర్ వర్క్స్, ఎంటమాలజీ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులతో బోరబండ కార్పొరేటర్ మహమ్మద్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎవరి పని వారు చేస్తూ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాకాలంలో ఏ ఒక్క ప్రాణ నష్టం జరగవద్దని, షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మేయర్ చెప్పారు. డార్క్ ఏరియాలలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని, అందుకు పోలీస్‌శాఖ సహకారంతో అనుమానిత ఏరియాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంచి నీటి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, నీటిని వృథా చేయొద్దని మేయర్ చెప్పారు. చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని, వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, డీ-సిల్టింగ్ చేయడం రెగ్యులర్‌గా జరగాలన్నారు. కార్యక్రమంలో యూసుఫ్‌గూడ డీసీ సేవ ఇస్లావత్, జలమండలి డివిజన్ -6 జీఎం హరిశంకర్, డీజీఎం వాహెబ్, మేనేజర్లు శ్రీనివాస్, రాజేందర్, జీహెచ్‌ఎంసీ ఈఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మడుల్లో నీరు

నిల్వ ఉండకుండా చూడాలి

- సరైన మెళకువలతో పంటలను కాపాడుకోవచ్చు
- వ్యవసాయ శాఖ అధికారులు

వరినాట్లు వేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం, జూలై 16 : ముసురు వానలతో రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే సాగు చేసిన పంటలు దెబ్బతినే ప్రమాదముందని పలువురు వ్యవసాయ నిపుణులు, అధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాల్లో సాగుచేసుకుంటున్న వివిధ రకాల పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తమ పొలాల్లో సాగుచేసుకున్న పంటల మడుల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి.

వరిపంట..

ప్రస్తుతం జిల్లాలో ఎక్కువగా వరి పంటను సాగు చేస్తున్నారు. వరినారు మడుల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వెదజల్లే పద్ధతిలో విత్తుకున్న పొలాలు, మడుల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి. చిన్న మొలకలు అధిక నీటిని తట్టుకోలేవు. రైతులు వర్షం నీరు నారుమడుల్లో నిల్వఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎలాంటి మందులు వేసినా పనిచేయవు. వాతావరణం మాములు స్థితికి వచ్చిన తర్వాత అధికారుల సూచనల మేరకు ఎరువులు, కలుపు నివారణ మందులు వాడితే బాగుంటుంది. ఇప్పటివరకు నార్లు పోయని రైతులు వర్షాలు తగ్గిన తర్వాత పోసుకుంటే మంచింది. ఇప్పటికే నార్లు పోసిన మడులు వర్షాలు తగ్గిన తర్వాత దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. నారు పండుబారి పేలవంగా కనిపించిన చోట యూరియా వేసుకోవాలి. చెలెటెడ్ జింక్ 1 గ్రాము లేదా జింక్ సల్ఫేట్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పత్తిపంట..

నిల్వ నీటిని లేత దశలో ఉన్న పత్తిపంట తట్టుకోలేదు. గండ్లు పెట్టి నీటిని పత్తిపంట నుంచి తొలగించాలి. ఈ వర్షాలకు అధికంగా కలుపు మొక్కలు వచ్చి పంటతో పోటీ పడే ప్రమాదం ఉంటుంది. అందువల్ల వానలు తగ్గిన తర్వాత పారాక్వాట్‌క్లోరైడ్ 5 మిల్లీలీటర్లకు లీటరు నీటిని కలిపి పంటపై పిచికారీ చేయాలి. ఆ తర్వాత దశలో ఫైరిథియోబ్యాక్ సోడియం, క్విజాఫాప్ ఇథైల్ కలయిక మందు మాస్టర్‌స్టోక్ 450 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారీ చేస్తే వెడల్పు ఆకులు కలిగి ఉండే గడ్డిజాతి కలుపును అదుపులో ఉంచొచ్చు. ఈ మందును కంది అంతర పంటగా ఉన్న పత్తిలో వాడొద్దు. వర్షాలు తగ్గిన తర్వాత బ్లూస్టర్ డోస్‌గా ఎకరాకు 25-30 కిలోల యూరియా మొక్కల పక్కన వేసుకోవాలి. పోషక లోప నివారణకోసం 19-19-19 లీటర్ నీటికి 7.5 గ్రాముల ఫార్ములా 4-2 గ్రాముల చొప్పున సూస్ప్రెడ్‌మాక్స్ 1 మిల్లీమీటరును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పత్తి ఆకులపై రంధ్రాలు, ముడతలు కనిపిస్తే క్లోరిఫైరిపాస్ 20 2.5 మిల్లీలీటర్లు, లేదా ఎసిఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పత్తిపంటలో అధిక దిగుబడి సాధించేందుకు సరైన మెళకువలు పాటించాలి.

మొక్కజొన్న, ఇతర పంటలు..

మొక్కజొన్నలోనూ నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. వర్షం తగ్గిన తర్వాత బూస్టర్ మోతాదుకు 53 కిలోల యూరియా 15 కిలోల మ్యూరేట్‌ఆప పొటాష్ వేసుకోవాలి. జింక్, బోరన్ లోపం కనిపిస్తే బోరాన్ 2 గ్రాములు, చెలెటెడ్ జింక్ 1 గ్రాము చొప్పున పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. కూరగాయల పంటలకు వర్షాల కారణంగా ఆకుమచ్చ, కాండం కుళ్లు తెగుళ్లు ఆశిస్తాయి. కాపర్ ఆక్స్‌క్లోరైడ్ 30 గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పోషక లోప నివారణకు 13-0-45 లీటర్ నీటికి 10 గ్రాముల ఫార్ములా 4-2గ్రాముల కలిపి పిచికారీ చేయాలి.



అధికారుల సలహాలు పాటించాలి

వర్షాల నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. అధికారులు రాసి ఇచ్చిన మందులు, ఎరువులను వాడి పంటలను కాపాడుకోవాలి. అదేవిధంగా సరైన మెళకువలు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటించాలి.

-వరప్రసాద్‌రెడ్డి, ఏవో ఇబ్రహీంపట్నం

ఐటీ కంపెనీలకు..

ఆర్టీసీ బస్సులు

- కంపెనీలతో సంప్రదింపులకు ప్రత్యేక నోడల్ అధికారి
- ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు
- సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌తో చర్చించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సిటీబ్యూరో, జూలై 16(నమస్తే తెలంగాణ): ఐటీ ఉద్యోగులకు మెరుగైన మౌలిక వసతులను కల్పించేందుకు ఐటీ కంపెనీలు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి. ఒక ఐటీ ఉద్యోగి ఇంటి నుంచి ఆఫీసు వచ్చే వరకు అవసరమైన ఏర్పాట్లను కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రస్తుతం, ఐటీ కారిడార్‌లో ప్రైవేటు వాహనాలకు తోడు ఐటీ కంపెనీలు హైర్ చేసుకున్న కార్లు అధికంగా ఉండటంతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారాయి. ఇదే విషయమై ఐటీ కంపెనీల ఫెసిలిటీ మేనేజర్లతో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌తో చర్చించింది. హైదరాబాద్‌లో ఐటీ రంగం దినదినం అభివృద్ధి చెందుతుండటంతో లక్షలాది మంది ఉద్యోగరిత్యా నగర నలుమూలల నుంచి ఐటీ కారిడార్‌లోని కంపెనీలకే వచ్చి పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో లక్షలాది వాహనాలు ఐటీ కారిడార్‌కు వచ్చి వెళ్తున్నాయి. కాగా, ఐటీ కారిడార్‌కు మెట్రో సౌకర్యం ఉండటంతో కొందరు ఐటీ ఉద్యోగులు మెట్రోలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అయినా, ఐటీ కారిడార్లలో ఎక్కడ చూసినా వాహనాల రద్దీ గణనీయంగా ఉంటోంది.

ఈ నేపథ్యంలోనే కార్లకు బదులుగా ఎక్కువ మంది ప్రయాణం చేసేందుకు వీలుండే బస్సులను ఐటీ కంపెనీల నుంచి నడపడం ద్వారా కొంత మేరకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇదే విషయాన్ని ఇటీవలే ఐటీ కంపెనీలకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొని ఆర్టీసీ ఎం.డి సజ్జనార్ దృష్టికి తీసుకువెళ్లారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

ఐటీ కంపెనీలతో చర్చించేందుకు నోడల్ అధికారి...

ఐటీ కంపెనీలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వడంపై ఆర్టీసీ సంస్థ పరంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామని ఎం.డి సజ్జనార్ హామీ ఇచ్చారు. ఆర్టీసీ తరపున ఐటీ కంపెనీలతో చర్చించేందుకు ఒక నోడల్ అధికారిని నియమిస్తామని చెప్పారు. ఐటీ కంపెనీల ఫెసిలిటీ మేనేజర్లు తమకు ఎన్ని బస్సులు అవసరం ఉన్నది? ఏయే మార్గాల్లో నడపాలన్న విషయాలను నోడల్ అధికారులతో మాట్లాడి, ఆర్టీసీ బస్సులను హైర్ చేసుకోవచ్చని ఐటీ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఐటీ కారిడార్‌లోని ప్రధాన ప్రాంతాలైన మాదాపూర్, రాయదుర్గం, కొండాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్సియల్ డిస్ట్రిక్, నానక్‌రాంగూడ, పుప్పాల్‌గూడ, కోకాపేట ప్రాంతాల్లో సుమారు 1500లకు పైగా ఐటీ కంపెనీలు ఉండగా, అందులో 150 నుంచి 250 కంపెనీల్లో 10 వేల నుంచి మొదలు కొని 20 వేల మంది దాకా ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఆయా కంపెనీలు తమ ఉద్యోగుల కోసం ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలతో కలిసి మినీ బస్సులు, 5,7 సీట్లర్ కార్లను అద్దెకు తీసుకుంటున్నాయి. వీటికి బదులుగా ఆర్టీసీ బస్సులను ఐటీ కంపెనీ ప్రాంగణాల నుంచి నడిపితే కార్ల సంఖ్య తగ్గడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పట్టేందుకు అవకాశం ఉంటుందని ఓ ఐటీ కంపెనీ ఫెసిలిటీ మేనేజర్ తెలిపారు.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణపై సంయుక్త కార్యాచరణ

ఐటీ కారిడార్‌లో ఉద్యోగుల భద్రతతో పాటు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు పోలీసులు, ఐటీ కంపెనీలతో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ పనిచేస్తోంది. ఇప్పటికే మహిళల కోసం ఉచితంగా షీ షెటిల్ పేరుతో ఐటీ కారిడార్‌లోనే తిరిగేలా ప్రైవేటు బస్సులను నడుపుతున్నారు. అయితే ఇవీ ఐటీ ఉద్యోగుల ప్రయాణ అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చడం లేదు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం ఆర్టీసీతో కలిసి సంయుక్త కార్యాచరణ రూపొందించడం ద్వారా నగర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సులను ఐటీ కారిడార్‌కు నడిపేలా చర్యలు తీసుకుంటామని ఐటీ కంపెనీ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ పోలీసులతో భద్రతా పరమైన అంశాలపై పనిచేస్తుండగా, ఇక నుంచి రవాణా వ్యవస్థలపైనా ప్రధానంగా దృష్టి సారిస్తామని, ఆర్టీసీతో కలిసి ప్రజా రవాణా వ్యవస్థ ఐటీ ఉద్యోగులకు అనుకూలంగా ఉండేలా చూస్తామని తెలిపారు.

ఒంటి కాలుపై నిలబడి..

- నిరసన తెలిపిన మధ్యాహ్న భోజన కార్మికులు
- పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలని డిమాండ్

కందుకూరు, జూలై 16: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా మండల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికులు రిలే నిరాహార దీక్షలకు దిగారు. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలల నుంచి ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించే వరకు ఆందోళన చేస్తామని తెలిపారు. పెరిగిన కూరగాయల ధరలకు అనుగుణంగా రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన మాదిరిగా నెలకు రూ.10వేలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మధ్యాహ్న భోజన కార్మికులు సంఘం కార్యదర్శి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రభావతి, శంకరమ్మ, అలివేలు, భారతమ్మ, మంజు, చంద్రకళ, మంగమ్మ, జంగమ్మ, అశ్విని, లలిత పాల్గొన్నారు.

కందుకూరులో ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు